RNI:TS-28-0030298

# తెలంగాణ డైలి న్యూస్

ప్రజల గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

telanganadailynews.in

epaper.tgdailynews.com

సంపుటి : 01 సంచిక : 205 మంగళవారం, ఆగస్టు 04, 2026 , పేజీలు - 06 వెల : 3/-

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్రా వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ డైలి న్యూస్ జాతీయ దినపత్రికలో, బ్యూరో, మండలాల రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9553111142

# కొత్త పెన్షన్లు అందేది వీరికే

**కొత్త పెన్షన్ల పంపిణీ మార్గదర్శకాలు ఖరారయ్యాయి. ఆగస్టు 15 నుంచి చేయూత పథకం కింద కొత్త పింఛన్లు అందించనుంది.**

**హైదరాబాద్, ఆగస్టు 3:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్ల పంపిణీ మార్గదర్శకాలు ఖరారయ్యాయి. సీఎం రేవంత్ ఇప్పటికే కీలక ఆదేశాలు ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి చేయూత పథకం కింద కొత్త పింఛన్లు అందించనుంది. వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులలో అర్హులైన వారందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని డిసైడ్ అయ్యారు. దాదాపు పది లక్షల మందికి కొత్త పెన్షన్ల కోసం రూ 2,500 కోట్ల మేర ప్రభుత్వం పైన భారం పడుతుందని లెక్కలు తేల్చారు.తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీకి రంగం సిద్దమైంది. కుల గణన లెక్కల మేర తేల్చిన అర్హులకు అనుగుణంగా కొత్త లబ్దిదారులను ఖరారు చేస్తున్నారు.



కొత్తగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు కూడా పింఛన్లు అందిచాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా అర్హులను వెంటనే గుర్తించాలని సూచించారు. ఈ మేరకు తొలి దశలో సుమారు 2.5 లక్షల కొత్త పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 లక్షల చేయూత పెన్షన్లు అందుతుండ గా.. కొందరు అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు క్షేత్ర స్థాయి సమాచారం సేకరణలో తేలినట్లు చెబుతు న్నారు. వీరి పైన వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొత్త పెన్షన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందే అనర్హులను గుర్తించి ఏరి వేయాలని భావిస్తున్నారు. కాగా.. 2026-27 వార్షిక బడ్జెట్ లోనూ కొత్త పెన్షన్ల పంపిణీ పైన ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.కాగా, తాజాగా సీఎం రేవంత్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు.

### నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్

# శస్త్రచికిత్సలు పూర్తి

## : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 3 :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డివ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు.నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు.

### అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు..

# సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 3 :** అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (సోమవారం) మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. ఈ లేఖను వారికి షేర్ చేయాలని ఆయన తన సూసైడ్ నోట్‌లో తెలిపారని అన్నారు. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు..వేణు రాసిన సూసైడ్ నోట్ సీఎం రేవంత్‌రెడ్డికి అందిందా...? రాష్ట్రంలో, దేశంలో యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ఢిల్లీ నుంచి పెద్ద వాళ్లను తీసుకువచ్చి బిల్డప్పులు కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు ఈ విషయంపై స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ కనపడరని చెప్పుకొచ్చారు. సొంత నియోజకవర్గంలో యువకుడు ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం

## : కిషన్‌రెడ్డి

**ఢిల్లీ, ఆగస్టు 3 :** ఆ డీప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికారు లకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ఝాఖూజ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు.ఝాఖూజ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా



ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు.25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది..తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ (3 ఆగస్టు, 2026) వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ఝాఖూజ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. 2వేల మందికి ఉద్యోగాలు...దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే +-8 (మంచి క్వాలిటీ) బొగ్గు కారణంగా.. మొత్తం రూ.43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అ భిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ.48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జోగినిలకు ప్రత్యేక గుర్తింపు..

# గుర్తింపు కార్డులు జారీ చేస్తాం!

## : మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 3:** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు.జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత చేశారు.

### రంజాన్‌కు రూ.33 కోట్లు.. బోనాలకు రూ.20 కోట్లేనా..

# రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ ఫైర్



**హైదరాబాద్, ఆగస్టు 3:** బోనాల పండుగ నిధుల కేటాయింపుపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వివాదం చెలరేగింది. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్.. బోనాలకు రూ.20 కోట్లు మాత్రమే ఇవ్వడం వివక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. హిందూ పండుగలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు .తెలం గాణలో పండుగలకు నిధులు కేటాయించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రంజాన్ పండుగ నిర్వహణకు రూ.33 కోట్లు కేటాయించిన రేవంత్ రెడ్డి సర్కార్.. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాల ఉత్సవాలకు కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఇవ్వడం సరైందేనా అని ప్రశ్నించారు.ఆదివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. తెలంగాణలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు.

### ప్రజలను చంపాలనుకోవటం లేదు..

# ఇరాన్‌తో చర్చలపై ట్రంప్..



**అమెరికా:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలపై క్లారిటీ ఇచ్చారు. ఈ రోజు (సోమవారం) నుంచే ఇరాన్‌తో అమెరికా చర్చలు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని అన్నారు. తాను ప్రజలను చంపాలనుకోవటం లేదని తేల్చి చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..'ఇరాన్‌తో సోమవారం మధ్యాహ్నం నుంచి చర్చలు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ చర్చలు ఎలా సాగుతాయో వేచి చూడాలి. నేను ప్రజలను చంపాలనుకోవట్లేదు. ఎందుకంటే సైనిక దాడుల వల్ల చాలా మంది చనిపోతారు. అది నాకు ఇష్టం లేదు' అని స్పష్టం చేశారు.ఇరాన్‌పై దాడి తాత్కాలికంగా నిలిపివేతగత వారం ఇరాన్‌పై జరపాలనుకున్న అత్యంత భారీ సంయుక్త సైనిక దాడులను అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు తాత్కాలికంగా నిలిపివేశాయి. యుద్ధాన్ని ముగించేందుకు ఇరుపక్షాల మధ్య ఒక ప్రాథమిక శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు.

# మరో జిల్లా పర్యటనకు వైఎస్ జగన్..

**అమరావతి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని వైఎస్ జగన్ సందర్శిస్తారు. పొగాకు కొనుగోళ్లను పరిశీలించనున్న వైఎస్ జగన్ .. పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. జూలై 22వ తేదీ వివిధ జిల్లాల పొగాకు రైతులు జగన్‌ను కలిసి తమ బాధలు చెప్పుకున్న సంగతి తెలిసిందే.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బుధవారం రోజు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించనున్న జగన్, కొనుగోళ్ల తీరును పరిశీలించడంతోపాటు పొగాకు రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. బుధవారం ఉదయం 9 గంటల 30 నిమిషాల సమయంలో వైఎస్ జగన్ తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరుతారు. ఉదయం 10.30 గంటలకు



దేవరపల్లి చేరుకుంటారు. అక్కడ పొగాకు కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను వైసీపీ అధినేత పరిశీలిస్తారు. అనంతరం పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న జగన్.. పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకుంటారు. రైతుల సమస్యలు, ఇబ్బందులపై వారితో చర్చిస్తారు. అనంతరం మధ్యాహ్నం దేవరపల్లి నుంచి తిరుగు ప్రయాణమవుతారని వైసీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది .మరోవైపు వివిధ జిల్లాలకు చెందిన పొగాకు రైతులు ఇటీవల వైఎస్ జగన్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. పొగాకు ధరల సంక్షోభం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యంపై తమ సమస్యలను జగన్ వద్ద ప్రస్తావించారు. వేలం ప్రారంభమై ఇన్ని రోజులు గడిచినా పొగాకు కొనుగోళ్లు పూర్తికాలేదని.. జులై నాటికి ముగియాల్సిన అమ్మకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని జగన్ వద్ద ప్రస్తావించారు. కొన్ని వేలం కేంద్రాల్లో 30 నుంచి 40 శాతం వరకు నో బిడ్స్, రిజెక్షన్లు నమోదవుతున్నాయని.. తిరస్కరించిన ఒక్కో బేలును మళ్లీ వేలానికి తీసుకురావడానికి కనీసం రూ.1,000 అదనపు భారం పడుతోందని వాపోయారు. ఒక్కో బ్యారన్‌పై రూ.5 లక్షల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# కామాఖ్యా దేవి అమ్మవారిని దర్శించుకున్న బిఆర్ఎస్ నాయకులు



**పరిగి, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ):** అస్సాం రాష్ట్రంలోని ప్రసిద్ధ కామాఖ్యా శక్తి పీఠాన్ని వికారాబాద్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు సోమవారం దర్శించుకున్నారు. గౌహతి పట్టణ సమీపంలో కొండపై వెలసిన ఈ దివ్య క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికారాబాద్ జిల్లా దోమ మండల మాజీ జడ్పీటీసీ కుప్పుల నాగిరెడ్డి, దోమ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు కే. రాజిరెడ్డి, కుల్కచర్ల మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు పిరంపల్లి రాజుతో పాటు నాయకులు మల్లేషం, సంతోష్ తదితరులు ఈ దర్శనంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేసి, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దేశంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన కామాఖ్యా దేవి అమ్మవారు కోరిన కోరికలు తీర్చే శక్తి పీఠంగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. దశమహావిద్యల స్వరూపిణిగా వెలసిన అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రోజువారీగా వేలాది మంది భక్తులు విచ్చేసే ఈ క్షేత్రంలో పురాతన సాంప్రదాయం ప్రకారం మూగ జీవులను బలిచ్చే ఆచారం నేటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు.

# ప్రశ్నిస్తే కేసులు పెడతారా పోలీసుల తీరుపై ప్రజాసంఘాల ఆగ్రహం

- దళిత రైతుకు న్యాయం చేయాలని అదనపు ఎస్పీకి ఫిర్యాదు

**వికారాబాద్, ఆగస్టు 4 (తెలంగాణ డైలీ న్యూస్):** బాధిత దళిత రైతుకు న్యాయం చేయాలని, ఆయనపై నమోదైన కేసును రద్దు చేయడంతో పాటు భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేష్ మీనాకు ఫిర్యాదు చేశారు. పూడూర్ మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత రైతు జైదుపల్లి నర్సిములుకు సర్వే నెం. 120 లో ఉన్న 1 ఎకరం 35 గుంటల భూమిని ఏసీఈ టైర్ కంపెనీ యాజమాన్యం ఫ్రీకాస్ట్ పలకలు వేసి ఆక్ర మించేందుకు ప్రయత్నించిందని సీఐటీయూ మరియు ఇతర ప్రజా సంఘాల నాయకు లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు పలుమార్లు పోలీసులను ఆశ్రయించి నప్పటికీ కంపెనీ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. చన్‌గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డి విధుల నిర్వహ ణలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ, భూమి కోల్పోయిన రైతుపైనే కేసు నమోదు చేశారని నాయకులు అదనపు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడిపై బనాయించిన కేసును రద్దు చేయాలని, భూ ఆక్రమణకు ప్రయత్నించిన కంపెనీ యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవా లని వారు కోరారు. అలాగే ఏకపక్షంగా వ్యవహరించిన ఎస్సైపై శాఖాపరమైన విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యూ. బుగ్గప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, నాయకుడు సాధిక్, బాధిత రైతు జైదుపల్లి నర్సిములు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దయనీయ స్థితి

- కనీస వసతులు కల్పించకపోవడం ప్రభుత్వ వైఫల్యమే..
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**పరిగి, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు సోమవారం నేరుగా వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సందర్శించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అవస్థలను అడిగి తెలుసుకున్న వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. తరగతి గదులు లేక, కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలో సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు, విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదుల కొరత వల్ల ఒకే గదిలో ఇద్దరూ ఉపాధ్యాయులు రెండు తరగతులకు బోధన నిర్వహిస్తున్నారు. గదులు చాలని పరిస్థితిలో విద్యార్థులు మెట్లపై కూర్చొని పాఠాలు వినాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.1 కోటి నిధులతో మంజూరు చేయించిన 10 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని స్పష్టం చేశారు.

స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ వెంటనే ఈ కళాశాలను సందర్శించి, సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, వెంటనే చర్యలు తీసుకో వాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకుండా, సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో వికారాబాద్ మండల బిఆర్ ఎస్ నాయకులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు



# నిరుపేద కుటుంబానికి అండగా ఉద్యోగుల బృందం




**దోమ, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వ ఉద్యోగుల బృందం వికారాబాద్ జిల్లా దోమ మండలం శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోళ్ల సుగుణ (32) అనే మహిళ గత శుక్రవారం (తేదీ 31.07.2026) అనారోగ్య సమస్యతో అకాల మరణం చెందారు. చిన్న వయస్సులోనే మహిళ మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర శోక ఛాయలు అలముకున్నాయి. ఇట్టి విషయం తెలుసుకున్న శివారెడ్డిపల్లి గ్రామ ఉద్యోగుల బృందం మానవత్వంతో స్పందించి, మృతురాలు అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబానికి 5,000 ఐదువేల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శివారెడ్డిపల్లి గ్రామ ఉద్యోగ సంఘం సభ్యులు గతంలోనూ, ప్రస్తుతం కూడా గ్రామంలో ఏ పేద కుటుంబంలో మరణం సంభవించినా తమ వంతుగా ఆర్థిక సాయం అందిస్తూ చేయూత నిస్తున్నారు.

వారి సామాజిక బాధ్యతను, నిరంతర సేవా నిరతిని గ్రామస్తు లందరూ ముక్తక ంఠంతో హర్షిస్తూ, అభినందనలు తెలిపారు. ఈ సాయం అందించే కార్యక్రమంలో శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉద్యోగ సంఘ నాయకులు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, కానిస్టేబుల్ చిన్న, ముఫైర్ కానిస్టేబుల్, ఇతర గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కూచిపూడి నాట్య వేదికపై లేక్ ట్రావిస్

## విద్యార్థిని విభా యాదవల్లి మెరుపులు



**హైదరాబాద్** భారతీయ సనాతన శాస్త్రీయ నృత్య రూపమైన కూచిపూడిని అమెరికా గడ్డపై ప్రచారం చేస్తూ, తెలుగు కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు యువ నర్తకి విభా యాదవల్లి. టెక్సాస్ లోని లేక్ ట్రావిస్ హైసూల్ లో జూనియర్ విద్యార్థినిగా చదువుతున్న విభా, కేవలం 16 సంవత్సారాల చిన్న వయసులోనే నాట్య రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. విభా నాట్య ప్రయాణం కాలిఫోర్నియాలో లక్ష్మీ భవానీ కొండూరు వద్ద ప్రారంభమైంది. అక్కడ కూచిపూడికి బలమైన పునాది వేసుకున్న విభా 2021లో టెక్సాస్‌కు తమ మకాం మార్చాక ప్రముఖ నాట్యాచార్యులు రాజీ రాయప్రోలు, పసుమర్తి వెంకటేశ్వర శర్మల ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు. తల్లి దండ్రులు జోత్న, శ్రీరాం యాదవెల్లి ప్రోత్సాహంతో ,గురువుల అండదండలతో ఆమె నృత్యంలో అభినయం, భంగిమలు, లయ బద్ధత సాంప్రదాయ సౌందర్యం మరింత పరిపూర్ణమయ్యాయి.

**కథకురాలిగా, కళాకారిణిగా విజయాలు..**

ఆస్టిన్ పరిసర ప్రాంతాలలో జరిగిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య నాటికలు, రీసైటిల్స్ లో సామాజిక వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ విభా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు.

కేవలం అడుగుల గజిబిజి కాకుండా, హావభావాలతో పాత్రలకు జీవం పోస్తూ మంచి కథకురాలిగానూ ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. కేవలం కూచిపూడికే పరిమితం కాకుండా, విభా తన హైసూల్ వర్సిటీ డ్యాన్స్ టీమ్ లోనూ క్రియాశీల సభ్యురాలిగా రాణి స్తున్నారు. ఇది ఆమెలో నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్, క్రమశిక్షణను పెంపొందించింది. శాస్త్రీయ,కంటెంపరరీ (సమకాలీన) నృత్యాలను సమపాళ్లలో అభ్యసిస్తూ తన కళా దృష్టిని మరింత విశాలం చేసుకున్నారు. తన విజయానికి కారణమైన గురువులకు, నిత్యం తనకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు విభా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంవత్సరాల తరబడి చేసిన కఠిన సాధన తాలూకు ఫలాలను ఆస్వాదిస్తూ, భవిష్యత్తులోనూ కూచిపూడి వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పడమే తన లక్ష్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# వికారాబాద్‌లో రిజిస్ట్రేషన్ల లొల్లి

- కలెక్టర్ ముందు బాధితుల ఆవేదన..
- ఒక చేతితో అనుమతులు ఇచ్చి..
- మరో చేతితో రిజిస్ట్రేషన్లు ఆపుతారా..
- సమస్య పరిష్కరించాలని.. కలెక్టర్‌కు మెతుకు ఆనంద్ వినతి




**వికారాబాద్, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్య విధానాల వల్ల ఉత్పన్నమవుతున్న ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ తక్షణమే సమీక్ష జరిపి, బాధిత కొనుగోలుదారులకు, విక్రయదారులకు న్యాయం చేయాలని మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ పట్టణంలో రియల్ ఎస్టేట్ రంగం, ప్లాట్ల కొనుగోలుదారులు, స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ స్పందించారు. సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సుమారు 10 నుండి 15 మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్లాట్ల కొనుగోలుదారులతో కలిసి ఆయన వికారాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. పలు కీలక అంశాలను లేవనెత్తారు. డీటీసీపీ లేఅవుట్ అనుమతులు పొందిన భూములను కూడా ప్రభుత్వం మళ్లీ నిషేధిత (ప్రోహిబిటెడ్) జాబితాలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాల విచారణలు పూర్తి చేసి, పక్కా పట్టా భూమిగా నిర్ధారించిన తర్వాతే డీటీసీపీ అనుమతులు ఇస్తుందని గుర్తుచేశారు. ఒక వైపు ప్రభుత్వమే అనుమతులు ఇచ్చి, మరోవైపు క్రయవిక్ర యాలు జరగకుండా ఆపడం వల్ల రియల్టర్లు, సామాన్య కొనుగోలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఒకే సర్వే నంబర్, బై నంబర్లతో ఎదురవుతున్న రిజిస్ట్రేషన్ సమస్యల గురించి స్పందిస్తూ... ఉదాహరణకు 10 ఎకరాల భూమి ఉన్న ఒకే సర్వే నంబర్‌లో కేవలం 2 ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉంటే, మిగిలిన 8 ఎకరాలకు సంబంధించిన బై నంబర్లు అ, ఎ నిషేధిత జాబితాలో లేకపోయినప్పటికీ.. సర్వే నంబర్ ఒకటే అనే కారణంతో అధికారులు మొత్తం 10 ఎకరాల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ ను వివరణ కోరగా, సరైన ఆధారాలు చూపిస్తే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం గతంలో చేసిన రిజిస్ట్రేషన్లను కూడా ఇప్పుడు చేయడం లేదని బాధితులు అంటున్నారని తెలిపారు.

వీటితో పాటు, వికారాబాద్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీని సందర్శించి అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్వయంగా తెలుసుకున్నామని, ఆ సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు మెతుకు ఆనంద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇంత ఘోరమా

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్న పాఠశాలలు
- పాఠశాలల దుస్థితిపై మండిపడ్డ కౌన్సిలర్ జావీద్..



**తాండూరు ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇంత ఘోరంగా ఉంటే స్థానిక ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారు అని కౌన్సిలర్ జావీ ద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల పట్ల నిర్లక్ష్యం వహించడం శోచనీయమని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. వికారాబాద్ జిల్లా తాండూరులోని రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో గల ప్రభుత్వ పాఠశాలలు తీవ్ర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా యని, అధికారుల నిర్లక్ష్య వైఖరి శోచనీయమని 8వ వార్డు కౌన్సిలర్ జావిద్ ధ్వజమెత్తారు. స్థానిక పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అక్కడ నెలకొన్న దుస్థితిపై తీవ్ర ఆందో ళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. పాఠశాల ప్రహరీ గోడ పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలల్లో తీవ్రమైన గదుల కొరత వేధిస్తోందని, కేవలం రెండు, మూడు గదుల్లోనే ఆరు, ఏడు తరగతుల వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఒకే చోట ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల విద్యార్థులకు పాఠాలు చెప్పడం వల్ల పిల్లలకు ఏమీ అర్థం కావడం లేదని స్పష్టం చేశారు. పాఠశాలలో ఒక్కరు మాత్రమే శాశ్వత ఉపాధ్యాయుడు ఉన్నారని, మిగతా వారంతా తాత్కాలిక సిబ్బందేనని పేర్కొన్నారు.

ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమిం చాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## అత్యుత్తమ డిజిటల్ సేవల కోసం మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టం చేయాలి సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్ :** రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్ట పరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్--ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఈ సమావేశంలోడిజిటల్ ఇండియా -- వికసిత్ భారత్--2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు , సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. టి-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రత్యేక సమీక్ష..దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతిని ధులు, సుమారు రూ. 2,000 కోట్ల పెట్టుబ డుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. టి-ఫైబర్ పై సమీక్ష అనంతరం టి-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. టీ-ఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్--ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ, టి-ఫైబర్ ఎం.డి., సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్క్‌ఫెడ్‌కు నష్టం రాకుండా మక్కలు అమ్మేశాం



**హైదరాబాద్ :** అధిక ధరకు మక్కలను విక్రయించడం ద్వారా మార్క్‌ఫెడ్‌కు నష్టం రాకుండా చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ-వేలం విధానంలో సగటున టన్నుకు రూ. 25, 370 రికార్డు స్థాయి ధరతో మక్కలను విక్రయిం చినట్టు వెల్లడించారు. ఈ-టెండర్ ద్వారా కాకుండా ఈ-వేలం వి ధానాన్ని అమలు చేయడం వల్ల మంచి ఫలితా లు వచ్చాయని పేర్కొన్నారు. 2025-26 యాసంగిలో మార్‌ఫెడ్ 14.6 లక్షల టన్నుల మక్కజొన్నలు కొనుగోలు చేసింది. సుమారు 3.8 లక్షల టన్నుల మక్కజొన్న గతంలోనే 22 వే లతో విక్రయించారు. మిగిలిన 10, 98 ,388 టన్నుల మక్కలను ఈ-వేలం ద్వారా విక్రయి ంచగా, కనిష్ఠ ధర రూ. 24,100, గరిష్ఠ ధర రూ. 26, 50 0, సగటు ధర రూ. 25,370 చొప్పున లభించింది.

# పదేళ్లుగా చాలీచాలని వేతనాలు

- ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నా స్పందించని అధికారులు
- తక్షణమే మా సమస్యలు పరిష్కరించాలి..
- లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతాం..
- అధికారులకు ఏఐ ఉపాధ్యాయుల హెచ్చరిక



**కుల్కచర్ల, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** పదేళ్లుగా చాలీచాలని జీతాలతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా మా వేతనాలు పెరగడం లేదు. తక్షణమే మా సమస్యలు పరిష్కరించి జీతాలు పెంచాలి.. లేనిపక్షంలో ఆగస్టు 17 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని ?గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఇచ్చిన నినాదమిది. రాష్ట్ర అధ్యక్షులు సురేందర్ నాయక్ పిలుపు మేరకు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ నాయకత్వంలో సోమవారం ప్రజాభవన్‌లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి జనార్ధన్లకు వినతిపత్రం అందజేశారు. రాత్రింబవళ్లు శ్రమిస్తున్నా.. దక్కని గుర్తింపు ఈ సందర్భంగా సంఘం నాయకులు రాజేందర్, శ్రీకాంత్, మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్నాం. డే డ్యూటీలు, నైట్ డ్యూటీలు, స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ 10వ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. రూ. 10, 300తో కుటుంబ పోషణ అసాధ్యం: ఏజెన్సీల ద్వారా నెలకు కేవలం ?10,300 మాత్రమే చేతికి వస్తోందని, ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో ఈ మొత్తంతో కుటుంబాలను పోషించుకోవడం అత్యంత భారంగా మారిందని వాపోయారు.

దోపిడీకి గురి చేస్తున్న 'థర్డ్ పార్టీ వ్యవస్థ'ను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లతో సమానంగా వేతనం చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ఇమానో చేశారు. మా దయనీయమైన పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, ఈ వినతి పత్రాలను ఉన్నతాధి కారులకు ట్రైబల్ వెల్ఫేర్ మినిస్టర్ దృష్టికి తీసుకెళ్లాలని అధికారులను కోరారు.

ఒకవేళ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే, రాష్ట్రవ్యా ప్తంగా ఉన్న 339 మంది అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ ఉపాధ్యా యుల ందరితో ఐక్యంగా ఆగస్టు 17 నుండి సమ్మె బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో కుల్కచర్ల, కొత్తపల్లి, బండ వెల్కి చర్ల, తాండూర్, రాంపూర్, బొంరేస్ పేట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పరిగి లో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు






- ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

**పరిగి, ఆగస్టు 4 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** పరిగి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగిన పోచమ్మ తల్లి బోనాలు, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. పరిగి పట్టణంలో పోచమ్మ తల్లి బోనాలు, గంగపుత్ర సంఘం తొట్టెల ఊరేగింపు మహోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా జరగడం సంతోషకరం. గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ మన ఐక్యతకు నిదర్శనం. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించి, మన ప్రాంత ప్రజలందరినీ చల్లగా చూడాలని, పరిగి నియోజకవర్గాన్ని సుభిక్షంగా ఉంచాలని ఆ పోచమ్మ తల్లిని మనస్ఫూర్తిగా ప్రార్థించాన్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో లక్ష్మీదేవి తాండవించాలని, పాడి పంట ల తో పరిగి విలసిల్లాలని కోరుకుంటున్నాను అని మహేష్ రెడ్డి తెలిపారు. ?గంగపుత్ర సంఘం సోదరులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించడం అభినందనీయం. ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులకు, కౌన్సిలర్లకు, సంఘ సభ్యులకు పరిగి పట్టణ ప్రజలందరికీ నా తరపున ప్రత్యే క కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గంగపుత్ర సంఘం, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పరిగి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి కూడా క్షుద్ర పూజలు చేస్తున్నారని ప్రచారం ఉంది ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్




తెలంగాణ భవన్ ఉద్యమాల వేదిక ..పోరాటానికి ప్రతిరూపమైన వేదిక.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అనే కాంగ్రెస్ నేతల పిచ్చి ఆరోపణలకు కూడా సమాధానం చెప్పాల్సి వస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ పిచ్చోడికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని కేసీఆర్ అంటుంటారు. కాంగ్రెస్ నేతలు క్షుద్ర పూజలు అంటూ హరీశ్ రావు మీద వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ఇది రాజ్యాంగం ప్రసాదించిన విలువలను కించపరచడమే.. కాంగ్రెస్ నేతలు అత్యంత నీచానికి పాల్పడుతున్నారు.. కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెట్టినట్టుగా రేవంత్ హయాంలో గాంధీ భవన్‌ను బూతుల అడ్డాగా మార్చారు. గాంధీ వచ్చి కూర్చున్న భవన్‌ను అపవిత్రంగా మార్చారన్నారు.

సెక్యులరిజం భావనను కాంగ్రెస్ నేతలు అపహాస్యం చేస్తున్నారు. హరీష్ రావు క్షుద్ర పూజలు చేశారు అని అసత్యపు ప్రచారం చేస్తున్నారు. హిందువులను అగౌరవ పరుస్తున్నారు.. శివతత్వాన్ని అవమానపరుస్తున్నారని దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ మేలు కోసం కేసీఆర్ చండీ యాగం చేశారు. ప్రజలు చెడిపోవడం కోసం పూజలు ఎన్నడూ చేయలేదు. ఎన్టీఆర్ మీద కూడా శవపూజ చేశారని ఇలాంటి వారే దుష్ప్రచారం చేశారు. హరీశ్ రావు అనేక అంశాల మీద ప్రభుత్వం పై పోరాడుతున్నారు. అందుకే హరీష్ రావు మీద కక్షగట్టి అడ్డమైన ఆరోపణలు చేస్తున్నారు. హరీష్ రావు శివమొగ్గ ముఖంబికా ఆలయాన్ని సందర్శించుకుంటే క్షుద్ర పూజలు చేసినట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. ముఖాంభికా దేవి ఎవరు.. శక్తి స్వరూపిణి ..అమ్మ వారిని రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్ నేతల నోళ్లు పడిపోతాయని దాసోజు హెచ్చరించారు.

**విజయ్ కూడా క్షుద్ర పూజలు చేశారా ..**

రేవంత్ రెడ్డే అద్దంకి, సామ రామ్మోహన్ రెడ్డితో క్షుద్ర పూజలు అని మాట్లాడిస్తున్నారు. శివమొగ్గ ఆది శంకరాచార్యులు తిరగాడిన అత్యంత పవిత్ర ప్రాంతం.. తమిళనాడు సీఎం విజయ్ కాంగ్రెస్ తో ఉన్నారు.. ఆయన కూడాముఖంబికా దేవాలయం వెళ్లారు.. విజయ్ కూడా క్షుద్ర పూజలు చేశారా .. అని దాసోజు శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, సిద్దరామయ్య ,శివకుమార్ కూడా అనేక గుడులు తిరుగుతున్నారు.. వాళ్లు కూడా క్షుద్రపూజలు చేస్తున్నారా.. రేవంత్ కూడా క్షుద్ర పూజలు చేస్తున్నారని ప్రచారం ఉంది..

# ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే

## భర్తీ చేయాలి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్ : యువతకు ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నిం టినీ వెంటనే భర్తీ చేయా లని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్ది రాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చాక ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని బీజేపీ, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగ యువత కు,విద్యార్థులకు కల్లబొల్లి కబుర్లు చెప్పా యన్నారు. కాంగ్రెస్ సర్కార్ జాబ్ కేలండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీకి ఎటువంటి నోటిఫి కేషన్లు జారీ చేయకపోవడంతో ఖమ్మం జిల్లా న్యాలక్మీపురంకు చెందిన వేణుకుమార్ ఆత్మ హత్యకు పాల్పడడం తీవ్ర విచార కరమన్నా రు.దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయ కురాలు ప్రియాంక గాంధీ యువ డిక్లరేషన్ పేరిట సరూర్ నగర్ స్టేడియంలో 2023 మే 8వతేదీన బహిరంగ సభ పెట్టి తాము అధికా రంలోకి వచ్చాక ఏటా 2లక్షల ఉద్యోగాలిస్తామన్న హామీని గత నెల 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే చోట జరిగిన మీటింగులో మరోసారి గుర్తు చేశారన్నారు. నిరుద్యోగులకు ప్రతి నెల 4వేల చొప్పున భృతి అందజేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనడాన్ని ఎంపీ రవిచంద్ర ప్రస్తావించారు.కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో 10వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేదని, పోలీస్ శాఖలో 20వేల ఖాళీలు ఉంటే కేవలం 7,400 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వడంతో యువత మండిపడుతున్నదన్నారు. విద్యార్థులు, యువత, అధ్యాపకులను ఉద్దేశించి క్రిమినల్ వేస్ట్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఎంపీ రవిచంద్ర తప్పుబట్టారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటి భర్తీకి నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు.

పేద కుటుంబానికి చెందిన వేణుకుమార్ వెంటనే కోలుకునేందుకు మెరుగైన వైద్య సేవల ందించడంతో పాటు పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బీఆర్ఎస్ అండగా ఉంటుందని, అధికారంలోకి వచ్చాక ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిస్తూ.. ఆత్మహత్యలకు పాల్పడకుండా మరింత శ్రద్ధతో తమ చదువులు కొనసాగించాల్సిందిగా విద్యార్థులు, యువతకు హితవు పలికారు.

# తెలుగు హిందీ పీఈటీలను అప్‌గ్రేడ్

## చేయాలి గెడెం శ్యాంసుందర్



ఇంద్రవెల్లి: తెలుగు, హిందీ గ్రేడ్ 2, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆది లాబాద్ జిల్లా అధ్యక్షుడు గెడెం శ్యామ్‌సుందర్ కోరారు. ఏటీఏ ఇంద్రవెల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గ్రేడ్ 2 తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయ 423 పోస్టులను అప్‌గ్రెడేషన్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నా రు. ఈ విషయంపై పలుదఫాలుగా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఆర్థిక శాఖ నుంచి అనుమతి రాకపోవడంతో పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రభుత్వ, లోకల్ బాడీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు అప్‌గ్రెడేషన్ ద్వారా సుమారు 11,000 పదోన్నతులు కల్పించి 30 నెలల కావస్తుందని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం ఆదివాసీ ఉపాధ్యాయులను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు.చిన్న భూభాగమైన ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించిన అనేక జీవోలు, చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, రాష్ట్రంలో 668 మండలాల్లో 55 షెడ్యూల్డ్ ఏరియా మండలాల్లో జీవో ఎంఎస్ నబర్ 3 స్థానంలో మరొక జీవో తీసుకురావాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో రేషనలైజేషన్ మినహాయింపు ఇవ్వాలని, అప్‌గ్రెడేషన్ అయిన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్ట్ మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న హెల్త్ స్కీమ్ పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురావాలని, పెండింగ్ పీఆర్సీ, డీఏలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏటీఏ జిల్లా ప్రధాన నాయకులు కే బాజీరావు, సెద్మకీ విద్యాసాగర్, జగనక్ పుండలిక్, బి సాయి గజనం, ఆత్రం తుకారామ్ , శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సమస్యలపై ఆరోగ్య శాఖ మంత్రికి

## వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్: సచివాలయం లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన సోమవారం ఆరోగ్య శాఖ సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఆరోగ్య శాఖకు సంబంధించిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గాల వారీగా ఆరోగ్య సంబంధిత సమస్యలు, ప్రభుత్వ వైద్య సంస్థల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది అందుబాటు, ప్రజా రోగ్య సేవల మెరుగుదల తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ ఆరోగ్య శాఖ కు సంబంధించి పలు ప్రతిపాదనలు మంత్రికి అందించి మంజూరు చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ప్రతిపాదనలు

బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ఏరియా ఆస్పత్రి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వెంటనే తేవాలని , పెండింగ్‌లో ఉన్న హాస్పిటల్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. భీమ్‌గల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాహత్ నగర్ గ్రామానికి తరలించేందుకు అనుమతి మంజూరు చేయడం, రాహత్ నగర్‌లో నూతన పీహెచ్‌సీ భవన నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేయడం గురించి విన్నవించారు. భీమ్‌గల్‌లో కొత్త పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మోర్తాడ్ మండలంలోని పాలెం లేదా తిమ్మాపూర్ గ్రామంలో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని కోరారుబాల్కొండ మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కొత్త భవన నిర్మాణానికి పరిపా లనా అనుమతి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాల్కొండ, మోర్తాడ్‌లో కొత్త పోస్టుమార్టం భవనాల నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని విన్నవించారు. బాల్కొండ నియోజకవర్గంలోని 24ఐ7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది మంజూరు చేయడం, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. బాల్కొండ నియోజకవర్గంలోని తొమ్మిది ఉపకేంద్ర భవనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న జాతీయ ఆరోగ్య మిషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 18 ఆరోగ్య ఉపకేంద్రాలు / ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసి, నిధులు విడుదల చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్లో మెషిన్‌ను మంజూరు చేయాలని, ఖాళీ పోస్టు లను భర్తీ చేయాలని, అత్యవసర అవసరాల కోసం నిధులు మంజూరు చేయా లని విన్నవించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డిపై ప్రభుత్వం ఒత్తిడి

## చేసిన మాట వాస్తవం కేటీఆర్



దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఒత్తిడిలో ఉన్న మాట వాస్తవం.. ఆయనపై రేవంత్ సర్కార్ ఒత్తిడి చేసిన మాట వాస్తవమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కొంతమంది ప్రభుత్వంలో ఉన్న వెదవలు ఆయన చేస్తున్న దాడిని, విమర్శలను తట్టుకోలేకపోయారని అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. పెద్దిసుదర్శన్ రెడ్డి ఇదే భవన్ నుంచి ఇదే సీట్‌లో కూర్చొని సివిల్ సప్లై స్కాంను బయటపెట్టారు. ఇదే సీట్‌లో కూర్చొని విద్యాశాఖలో జరిగిన బంకర్ బెడ్స్ కుంభకోణాన్ని బయటపెట్టారు. మా సుదర్శన్ రెడ్డి అంతటితో ఆగకుండా ఆ కాగితాలు, ఆధారాలు తీసుకెళ్లి ఈడీ ఆఫీస్‌కు వెళ్లి అక్కడ ఇచ్చారు. తర్వాత సుప్రీంకోర్టుకు పోయాడు. బాధాకరమెక్కడంటే సుదర్శన్ రెడ్డి చనిపోయిన మరునాడు మాకు సుప్రీంకోర్టు నుంచి కొంత రిలీఫ్ వచ్చింది.. గైడెన్స్ కూడా వచ్చింది. వీరికి నోటీస్ వచ్చింది. ఇది వాస్తవం ఈ రాష్ట్రంలో మా నాయకులెవరినీ కూడా వేధించకుండా, టార్చర్ చేయకుండా ఈ ప్రభుత్వం లేదు. దురదృష్టవశాత్తు సుదర్శన్ రెడ్డి విషయంలో అన్యాయం జరిగింది. మీరు చూశారు కదా.. అన్నారు.బీసీ రిజర్వేషన్లు మోదీ ఆపారని రేవంత్ రెడ్డి బుకాయిస్తున్నడు.నువ్వు చేసిన తీర్మానం.. చిత్తు కాగితం. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కేలా రేవంత్ వ్యాఖ్యలు.విద్యా హక్కు చట్టాన్ని తెచ్చింది సోనియా గాంధీ. మీరు తెచ్చిన చట్టాన్ని మీరే తుంగలో తొక్కుతారా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.గురుకులాల్లో 150 మంది విద్యార్థులను చంపడం కాంగ్రెస్ సక్సెస్సా. ఎండ్రిన్ తాగి చావండని తిట్టడం సక్సెస్సా..

కాంగ్రెస్ వచ్చాక తెలంగాణలో టెక్ ఉద్యోగాలు తగ్గిపోయాయి. 7 వేల ఐటీ ఉద్యోగాలు పోయాయి.ఎందుకు పోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలి.సీఎం రేవంత్, విద్యా శాఖ అట్టర్ ఫ్లాప్.అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు.

# అర్హతలేని పోలీస్ కోచింగ్ సెంటర్లు

## అధిక ఫీజు వసూలుతో కుచ్చుటోపీ



హనుమకొండ చౌరస్తా: పోలీస్ కోచింగ్ పేరుతో కొన్ని అనధికార, ప్రైవేట్ అకాడమీలు నిరుద్యోగుల ఆశలను ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. శిక్షణ పొందేందుకు వచ్చే నిరుద్యోగులకు నకిలీ అకాడమీలు గాలం వేస్తున్నాయి. సరైన వసతులు, నిపుణులైన ఫ్యాకల్టీ లేకుండా ప్రకటనలు గుప్పిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ ప్రకటనలు ఇచ్చి నిరుద్యోగులను ఆకర్షించి వేల రూపాయాలు వసూలు చేస్తున్నాయి. నగరంలో అనేక అకాడమీలు పోలీస్ కోచింగ్ పేరిట అధికంగా ఫీజులు వసూల్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ కిషన్‌పుర, నయీంనగర్‌లు నకిలీ కోచింగ్ సెంటర్లకు కేంద్రంగా మారాయి. కనీస నిబంధనలు, ఎలాంటి అర్హత లేకుండా అకాడమీలను నిర్వహిస్తున్నారు.రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ల ద్వారా నిర్వహించాల్సిన అకాడమీ సెంటర్లు పోలీస్ యూనిఫాం వేసి డ్యూటీలో ఉంటున్నవారే ఉచిత సేవ చేయ కుండా డబ్బులు తీసుకుని మరీ కోచింగ్ సెంటర్లు నడిపించడంపై మండిపడుతున్నారు. నాణ్యతలేని బోధన, అనుభవంలేని అధ్యాపకులతో నామమాత్రపు తరగతులు నిర్వహిస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లు తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వంద శాతం ఉద్యోగం ఇస్తామంటూ నకిలీ వాగ్దానా లు చేయడం, తప్పుడు హామీలు ఇచ్చి అకాడమీలు నిరుద్యోగుల నుంచి సొమ్ము చేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 7 వేల పోస్టులతో పోలీస్ నోటిఫికేషన్ ఇవ్వడంతో అకాడమీ నిర్వాహకుల పంట పండినట్లుగా భావిస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించా లనే పట్టుదలతో ఊరి నుంచి నగరానికి వస్తున్న నిరుద్యోగులు అకాడమీల పేరుతో మోసం చేసే కేసుల నిర్వాహకుల వలలో పడుతున్నారు. పలువురు నిర్వాహకులపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎలాంటి అర్హతలేని వారు అకాడమీలతో నిరుద్యోగుల నుంచి ఫీజుల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మీరు నా మాట వినట్లేదు నేను సంతోషంగా రాలేదు

#### భవిష్యవాణి వినిపించిన మాతంగి స్వర్ణలత



సికింద్రాబాద్ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు.ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణ నష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట చేయిస్తానని మాట ఇచ్చారని.. కానీ మాట నిలబెటుకోవడం లేదని అన్నారు.

# అమీన్‌పూర్‌లో చిట్టీల పేరుతో రూ.3 కోట్ల టోకరా ఇల్లు

## అమ్ముకుని రాత్రికి రాత్రే గుంటూరు దంపతులు పరార్





సంగారెడ్డి జిల్లా అధిక లాభాలు, నమ్మకమే పెట్టుబడి అంటూ చిట్టీల వ్యాపారం నిర్వహించిన ఓ దంపతులు చివరికి సభ్యులకు టోకరా ఇచ్చి పరారైన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో వెలుగుచూసింది. ఈ ఘటనలో సుమారు రూ.3 కోట్ల మేర మోసం జరిగినట్లు బాధి తులు ఆరోపిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. గుంటూరుకు చెందిన శిరీష, సాంబశివరావు దంపతులు చాలాకాలం కిందట హైదరాబాద్‌కు వచ్చి అమీన్‌పూర్‌లోని బీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సాయి గణేశ్ టెక్స్‌టైల్స్ పేరిట బట్టల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే చిట్టీల వ్యాపారం కూడా చేస్తున్నారు. . అయితే నెల నెల డబ్బులు సేకరించిన దంపతులు గడువు పూర్తయినా తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వ లేదు. ఈ క్రమంలోనే స్థానికుల నుంచి చిట్టీల పేరిట రూ.2కోట్ల మేర డబ్బులను సేకరించారు. ఆ తర్వాత అమీన్‌పూర్‌లోని తమ ఇంటిని అమ్మేసి, ఎవరికీ సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే పరారయ్యారు.దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దంపతుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.మరోవైపు బుద్వేల్‌లోనే ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. బుద్వేల్‌లో నివాసం ఉండే అశోక్ దంపతులు చిట్టీల పేరిట స్థానిక మహిళలు, చిన్న వ్యాపారుల నుంచి భారీ మొత్తం సేకరించారు. అనంతరం తన భార్యతో కలిసి ఇంటికి తాళం వేసి పరారయ్యాడు.

ఈ విషయం తెలిసిన బాధితులు.. అశోక్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. తాము పైసా పైసా దాచిపెట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### అత్యుత్తమ డిజిటల్ సేవల కోసం మీ సేవ కేంద్రాలను

#### మరింత పటిష్టం చేయాలి సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్ : రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్ట పరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ సంబంధిత అధికారులను ఆదేశిం చారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్--ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్ చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావే శమయ్యారు.ఈ సమావేశంలోడిజిటల్ ఇండియా -- వికసిత్ భారత్--2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# గంజాయి విక్రేతల వివరాలు నేనిస్తా అరెస్టు చేయండి స్పీకర్ అయ్యన్నపాత్రుడు




**విశాఖపట్నం :** రాష్ట్రంలో గంజాయి నిర్మూలనపై నిర్వహి ంచిన 'సంకల్పం 2.0' కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి మూలాలను మట్టుబెట్టడంలో పోలీసులు ఏమాత్రం రాజీ పడకూడదని స్పష్టం చేశారు.విశాఖపట్నం పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల హాస్టళ్లలో రాత్రి వేళల్లో విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే విషయాలు తని ఖీల్లో వెల్లడవుతుండటం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు గంజాయి బారిన పడితే వారి భవిష్యత్తు ఏమవుతుందో, వారి కుటుంబాల పరిస్థితి ఏంటో ఆలోచిం చాలని కోరారు. 'మనందరికీ పిల్లలు ఉన్నా రు.. వారి భవిష్యత్తు రక్షణ కోసం పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే ఎవ్వరూ ఏమీ చేయలేరు' అని పేర్కొన్నారు.గంజాయి సరఫ రాదారుల సమాచారం కావాలంటే తానే స్వయంగా ఇస్తానని, దమ్ముంటే వారిని అరెస్టు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారి పేర్లను తానిస్తానని.. వారిని అండమాన్ జైలుకు తరలించి కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులకు తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం గంజాయి నియంత్రణపై కఠిన చర్యలు తక్షణమే చేపట్టాలని పిలుపునిచ్చారు.

## శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయిన తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్



**శ్రీకాకుళం:** చాపరం భూ కబ్జా కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్, వైసీపీ నేత తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఇవాళ శ్రీకాకుళం కోర్టులో లొంగిపోయారు. విచారణ సందర్భంగా తన ఆరోగ్య పరిస్థితిని కోర్టు దృష్టికి చిరంజీవి నాగ్ తీసుకెళ్లగా.. అనారోగ్య కారణాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసింది.
అయితే, కేసు విచారణలో భాగంగా ఈ నెల 10వ తేదీన తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా, చాపరం భూ కబ్జా కేసులో చిరంజీవి నాగ్ ఏ-5 నిందితుడిగా ఉండగా.. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఏ-6, ఆయన భార్య వాణిశ్రీ ఏ-7 నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో విచారణ కొనసాగుతుండగా తాజా పరిణామాలు రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశం అయ్యాయి. కోర్టు తదుపరి విచారణలో కేసుకు సంబంధించిన మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## పల్నాడు అభివృద్ధికి అండగా ఉంటామని ప్రధాని హామీ ఇచ్చారు ఎంపీ కృష్ణదేవరాయలు



**ఢిల్లీ:** పల్నాడు జిల్లా అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక సాధికారతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వివరించారు. ఢిల్లీలోని ప్రధాని అధికారిక నివాసంలో ఆయనను ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా 'క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్' ప్రగతిపై సమగ్ర నివేదికను అందజేశారు. జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాల వివరాలను ప్రధానికి ఎంపీ వివరించారు.పల్నాడు జిల్లాలో 1.03 లక్షల మంది లబ్ధిదారులకు మొత్తం రూ.3,216 కోట్ల మేర రుణాలు పంపిణీ చేసినట్లు మోదీకి కృష్ణదేవరాయలు తెలిపారు. ఇందులో తొలిసారిగా 70 వేల మందికి పైగా లబ్ధిదారులకు రుణ సాయం అందించినట్లు వివరించారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ 83,365 మంది రైతులకు రూ.2, 286 కోట్ల మేర రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి వర్గాలకు ఆర్థిక అవకాశాలు పెంచేందుకు జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. పల్నాడు జిల్లాలో గ్రామీణ సాధికారత, ఆర్థిక పురోగతి కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రధాని మోదీ అభినందనలు తెలిపినట్లు ఎంపీ తెలిపారు.'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో భాగంగా జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ప్రధాని హామీ ఇచ్చినట్లు ఎంపీ కృష్ణదేవ రాయలు వెల్లడించారు. జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కేంద్ర పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టుపై ఏపీ అసెంబ్లీ బులెటిన్ విడుదల




**కర్నూలు జిల్లా:** ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు వ్యవహారంపై ఏపీ శాసనసభ కార్యదర్శి జనరల్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసింది. శాసనసభ సభ్యులందరికీ సమాచారం అందిస్తూ జారీ చేసిన ఈ బులెటిన్‌లో ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బులెటిన్ ప్రకారం.. ఆగస్టు 2వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేశారు.ఎమ్మెల్యేను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు బులెటిన్‌లో వెల్లడించారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో అరెస్టు అయినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లోనే నమోదైన మరో క్రైమ్ నంబర్ 38/2026 కేసులోనూ ఎమ్మెల్యే ఏ-1గా ఉన్నట్లు అసెంబ్లీ బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. శాసనసభ్యుడి అరెస్టు జరిగిన నేపథ్యంలో సభా నిబంధనల ప్రకారం సభ్యులందరికీ వివరాలు తెలియజేస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ బులెటిన్ జారీ చేశారు.కాగా, శనివారం నాడు చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలపై వందలాది మంది అనుచరులతో ఎమ్మెల్యే విరూపాక్షి దాడి చేశారు. పలువురు టీడీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి ఆడ, మగ అనే తేడా లేకుండా తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సహా 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 16 మందిని అరెస్టు చేయగా.. ఆలూరు కోర్టు రిమాండ్ విధించింది.

## మంత్రి సుభాశ్ చొరవ ఆ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి శస్త్రచికిత్స




**అమరావతి:** ఫ్యాన్‌కోనీ అనీమియాతో బాధపడుతున్న బాలుడికి అండగా ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ నిలిచారు. రూ.20 లక్షల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రిలో చరణ్ తేజ పవన్‌కు శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. బోన్ మ్యారో దాత నుంచి సేకరణ ప్రక్రియ విజయవంతమైంది. పేద కుటుంబానికి సహాయం అందించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసు కున్నారు.దాతలు, సేవా సంస్థల సహకారంతో చికిత్సకు నిధులను మంత్రి సుభాశ్ సమీకరించారు. సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చికిత్సలో భాగమైన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కావాలని ఆకాంక్షించారు.

## అభివృద్ధి కార్యక్రమాలు జగన్‌కు నచ్చవు ఎంపీ కలిశెట్టి



**ఢిల్లీ:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే జగన్‌కు నచ్చవని విమర్శించారు. ప్రజల్లో జగన్‌పై చర్చ జరుగుతుందని తెలిపారు. ఢిల్లీ వేదికగా మీడియాతో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. జగన్ తన మీడియాలో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను తాను సాధించానని చెప్పుకుంటున్నారని అన్నారు. ఈ విమానాశ్రయం ప్రారంభానికి కొన్ని గంటల ముందే ఉత్తరాంధ్ర పర్యటన చేపట్టి జగన్ సమస్యలు సృష్టించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. జగన్ ఉత్తరాంధ్ర పర్యటన చేసి సాధించింది ఏమిటి.? అని ప్రశ్నించారు.

**గడువు ముందే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేశాం..**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ భోగాపురం పర్యటనను సైతం జగన్ రెడ్డి డిస్టర్బ్ చేశారని ఎంపీ కలిశెట్టి ఆగ్రహించారు. భోగాపురం ఇంటర్నేషనల్ విమానాశ్రయం ప్రధానమంత్రి చేతుల మీదుగా ఆగస్టు ఒకటో తేదీన ప్రారంభించారని ప్రస్తావించారు. ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ప్రధానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ ఎయిర్‌పోర్ట్‌ను మూడు లక్షల మంది ప్రజల సమక్షంలో జాతికి అంకితం చేశారని చెప్పుకొచ్చారు. గడువు ముందే భోగాపురం విమానాశ్రయం పూర్తి చేశామని తెలిపారు.

**ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్**

ఉత్తరాంధ్రకు గేమ్ చేంజర్‌గా భోగాపురం ఎయిర్‌పోర్ట్ మారబోతుందని ఎంపీ కలిశెట్టి వివరించారు. సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను బాధ్యతగా పూర్తి చేస్తున్నారని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలో పరుగులు పెడుతుందని చెప్పుకొచ్చారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో ఉపాధి కోసం ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి వలసలు ఆగిపోయాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం పూర్తి చేయడంలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

# నేతన్న సేవలో పథకం అర్హులకు మంత్రి సవిత కీలక సూచన



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆ శాఖ అధికారులతో ఇవాళ మధ్యాహ్నం సమీక్షా సమావేశం నిర్వహించారు. 'నేతన్న సేవలో' పథకం అమలు, కార్యాచరణపై అధికారులతో చర్చించి వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు మంత్రి సవిత కీలక సూచనలు చేశారు. 'నేతన్న సేవలో' పథకానికి అర్హులు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువులోపు చేనేత కార్మికులందరూ దరఖాస్తులు చేసుకుని ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని అందుకోవాలని మంత్రి సవిత విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న గుంటూరు జిల్లా చీరాలలో సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభిం చనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా ఏటా రూ.25 వేల ఆర్థికసాయాన్ని చేనేత కార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో' పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల గౌరవప్రదమైన జీవనమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఈ సందర్భంగా సవిత చెప్పుకొచ్చారు.మరోవైపు, ఈ పథకం అమలులో ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా పని చేయాలని అధికారులకు మంత్రి సవిత సూచించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

## కూచిపూడి నాట్య వేదికపై లేక్ ట్రావిస్ విద్యార్థిని విభా యాదవల్లి మెరుపులు

**హైదరాబాద్:** భారతీయ సనాతన శాస్త్రీయ నృత్య రూపమైన కూచిపూడిని అమెరికా గడ్డపై ప్రచారం చేస్తూ, తెలుగు కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు యువ నర్తకి విభా యాదవల్లి. టెక్సాస్ లోని లేక్ ట్రావిస్ హైస్కూల్ లో జూనియర్ విద్యార్థినిగా చదువుతున్న విభా, కేవలం 16 సంవత్సరాల చిన్న వయసులోనే నాట్య రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. విభా నాట్య ప్రయాణం కాలిఫోర్నియాలో లక్ష్మీ భవానీ కొండూరు వద్ద ప్రారంభమైంది. అక్కడ కూచిపూడికి బలమైన పునాది వేసుకున్న విభా 2021లో టెక్సాస్‌కు తమ మకాం మార్చాక ప్రముఖ నాట్యాచార్యులు రాజీ రాయప్రోలు, పసుమర్తి వెంకటేశ్వర శర్మల ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నారు.
తల్లి దండ్రులు జోత్న, శ్రీరాం యాదవెల్లి ప్రోత్సాహంతో ,గురువుల అండదండలతో ఆమె నృత్యంలో అభినయం, భంగి మలు, లయ బద్ధత సాంప్రదాయ సౌందర్యం మరింత పరిపూర్ణమయ్యాయి.

## జగన్ సిగ్గులేకుండా విరూపాక్షిని సమర్థిస్తున్నారు మంత్రి ధ్వజం




**అమరావతి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విరూపాక్షి చేసిన ఘోరాన్ని ఖండించకపోగా... జగన్ సిగ్గులేకుండా సమర్థిస్తు న్నారని ధ్వజమెత్తారు. దళిత, బీసీ వర్గాలకు చెందిన మహిళ దుస్తులు చింపి, దుశ్శాసనుడిలా వైసీపీ ఎమ్మెల్యే ప్రవర్తించారని దుయ్యబట్టారు. అమరావతి వేదికగా మీడియాతో కొలుసు పార్థసారథి మాట్లాడారు. గొడ్డలి పార్టీ అరాచకాలను గమనిస్తున్న ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.

**గొడ్డలి పార్టీ యువత జీవితాలను నాశనం చేస్తోంది..**

సీఎం చంద్రబాబు యువత భవిష్యత్తు కోసం శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ వారి జీవితాలను నాశనం చేస్తోందని కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. ప్రజాసేవ కాదని.. అరాచకాలు, నేరాలు చేయడమే గొడ్డలి పార్టీలో కొనసాగడానికి ముఖ్య అర్హత అని ఎద్దేవా చేశారు. ఎంత పెద్ద అరాచకాలు సృష్టిస్తే... జగన్ రెడ్డి దగ్గర అంత ప్రాధాన్యం లభిస్తుందని విమర్శించారు. నేరాలు చేసి దొరికిపోయాక 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సింపతీ డ్రామాలు ఆడటం వీరికి అలవాటేనని సెటైర్లు గుప్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 45 ఏళ్లు దాటిన పేదవాడికి బతికే అర్హత లేదన్నట్లుగా జగన్ మాట్లాడారని ఆగ్రహించారు. శ్రీకాకుళంలో మహిళా పోలీసు మీద దుశ్శాసనుడి పర్వం కొనసాగించారని ధ్వజమెత్తారు.

# ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి టీచర్‌ను ఈడ్చుకెళ్లి కత్తితో పొడిచి హత్య



**చండీగఢ్:** ముఖానికి ముసుగు ధరించిన వ్యక్తి ఒక స్కూల్ వద్దకు చేరుకున్నాడు. ఒక టీచర్ గురించి అడిగాడు. ఆమె బయటకు రాగానే కత్తితో దాడి చేస్తూ ఈడ్చుకెళ్లాడు. మెడపై పలుమార్లు కత్తితో పొడిచి హత్య చేశాడు. సీసీటీవీలో రికార్డైన ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 29న ఉదయం 9.30 గంటల సమయంలో ముఖానికి మాస్క్ ధరించిన వ్యక్తి సిక్రోనా ప్రాంతంలోని ప్రైవేట్ స్కూల్ గేట్ వద్దకు చేరుకున్నాడు. ఆ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సంధ్యను కలవాలని చెప్పాడు. ఆమె వచ్చే వరకు అక్కడ వేచి ఉన్నాడు.కాగా, టీచర్ సంధ్య బయటకు రాగానే ఆ వ్యక్తి ఆమెను పక్కకు ఈడ్చుకెళ్లాడు. వెంట తెచ్చిన కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆమె అరుపులు విన్న స్కూల్ నిర్వాహకుడు పరుగున బయటకు వచ్చాడు. ఆ వ్యక్తిని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. అయితే కత్తితో అతడు బెదిరించడంతో లోపలకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి నేలపై పడిన టీచర్ సంధ్య మెడపై పలుసార్లు కత్తితో పొడిచాడు.

అనంతరం నంబర్ ప్లేట్ లేని బైక్‌పై అక్కడి నుంచి పారిపోయాడు.మరోవైపు కత్తిపోటు గాయాల తో అచేతనంగా పడి ఉన్న టీచర్ సంధ్యను అల్ ఫలాహ్ ఆసుపత్రికి తరలించారు. అయి తే అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన వ్యక్తి అమిత్ అని స్థానికులు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. నిందితుడైన పూర్వ విద్యార్థి అమిత్‌ను ఆ తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆ టీచర్‌ను అతడు వేధిస్తున్నట్లు పోలీస్ అధికారి ఆరోపించారు. అయితే ఆ స్కూల్ ప్రాం గణంలోని సీసీటీవీలో రికార్డైన ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## గుజరాత్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం
### మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విక్టరీ

**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఉప ఎన్నికలో గుజరాత్‌లోని మంజల్‌పుర్ నియోజకవర్గాన్ని బీజేపీ కైవసం చేసుకున్నది. వడోదర జిల్లాలో ఉన్న ఆ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి బికాబాయి రాబరిపై సుమారు 30 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నికల సంఘం డేటా ప్రకారం.. సతీశ్ పటేల్‌కు 55481 ఓట్లు పోలయ్యాయి. ఇక రాబరికి 24,851 ఓట్లు పడ్డాయి. 20 రౌండ్ల కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు పటేల్‌కు 30,630 ఓట్ల మెజారిటీ దక్కింది. జూలై 30వ తేదీన ఉప ఎన్నిక జరిగింది. సీనియర్ బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి యోగేశ్ పటేల్ జూన్ 2వ తేదీన మృతిచెందడంతో ఆ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. మంజల్‌పుర్ ఎన్నికలో కేవలం రెండు పార్టీలు మాత్రం ముఖాముఖిగా పోటీపడ్డాయి. కాంగ్రెస్, బీజేపీ మాత్రమే పోటీలో నిలిచాయి. ఈ సీటు గెలుపుతో గుజరాత్ అసెంబ్లీలో బీజేపీ సంఖ్య 162కు పెరిగింది. ఆ రాష్ట్రంలో మొత్తం 182 స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు 12, ఆమ్ ఆద్మీకి 5 సీట్లు ఉన్నాయి.




ఇక మధ్యప్రదేశ్‌లోని దాతియా నియోజకవర్గం కోసం జరిగిన ఉప ఎన్నిక హోరాహోరీగా సాగింది. ఆ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఘన్‌శ్యామ్ సింగ్ విజయం సాధించారు. ఆయనకు 66757 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి ఆశుతోష్ తివారిపై ఘన్‌శ్యామ్ గెలిచారు. సుమారు 6016 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం డేటా ద్వారా తెలుస్తోంది. ఆజాద్ సమాజ్‌పార్టీకి చెందిన దామోదర్ యాదవ్‌కు సుమారు 22 వేల ఓట్లు పోలయ్యాయి.

## కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ
### మాజీ సీఎం సిద్ధరామయ్య గైర్హాజరు







**బెంగళూరు:** కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. సోమవారం లోక్‌భవన్‌లో గవర్నర్ గెహ్లాట్ 20 మంతి కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే మాజీ సీఎం సిద్ధరామయ్య ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ప్రముఖ కురుబ నాయకురాలు గాయత్రి శాంతే గౌడను చివరి నిమిషంలో మంత్రివర్గం నుంచి తొలగించడం పట్ల ఆయన అసంతృప్తితో ఉన్నారుకాగా, మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్‌లో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. మంత్రి పదవులు దక్కకపోవడంపై పలువురు ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజీనామాలు, రహస్య సమావేశాలతో మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ పార్టీలో అసహనం పెరిగింది. ఈ తరుణంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సిద్ధరామయ్య గైర్హాజరు కావడం మరింత చర్చనీయాంశమైంది.మరోవైపు కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో ఇండి ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ వి. పాటిల్ సోమవారం తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. విధాన సౌధలో డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమానికి తన రాజీనామా లేఖను సమర్పించారు. పార్టీ నాయకత్వం తన పట్ల అన్యాయంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఆయన మద్దతుదారులు నినాదాలు చేస్తూ నిరసనలు చేపట్టారు

## కర్ణాటక కాంగ్రెస్‌లో క్యాబినెట్ విస్తరణ కలకలం
### పలువురు ఎమ్మెల్యేల రాజీనామా

**: కర్ణాటక:** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి బయటపడింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైన వేళ పార్టీలో అసంతృప్త జ్వాలలు వెల్లువెత్తాయి. క్యాబినెట్‌లో చోటు దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశవంతరాయగౌడ వి పాటిల్ తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణికి అందజేశారు. అదేవిధంగా బేలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే



బేలూరు గోపాలకృష్ణ సైతం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి కాంగ్రెస్ అధిష్ఠానానికి షాకిచ్చారు. తమతోపాటు మరో 10 మంది ఎమ్మెల్యేలు కూడా రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ క్యాబినెట్‌లోకి కొత్తగా 20 మంది మంత్రులను చేర్చుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే వరుస రాజీనామాలు, ఎమ్మెల్యేల అసంతృప్తితో రాజధాని బెంగళూరులో తీవ్ర కలకలం రేగింది. ఈ పరిణామాల నేపథ్యంలో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

## బంకీపూర్‌లో బీజేపీని మట్టికరిపించిన ప్రశాంత్ కిషోర్
### జన్ సూరాజ్‌కు తొలి ఎన్నికల విజయం

**పాట్నా:** బీహార్‌లో కీలకమైన బంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ (జేఎస్పీ) వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఘన విజయం సాధించారు. కంచుకోటలో బీజేపీని మట్టికరిపించారు. తొలిసారి ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. అలాగే ఆయన పార్టీకి తొలి ఎన్నికల విజయాన్ని సొంతం చేశారు. (గ్రాతీఘంష్ఘుత్ ఖఅంష్త్రశీతీ) సోమవారం జరిగిన కౌంటింగ్‌లో ప్రశాంత్ కిషోర్ 63,203 ఓట్లు సాధించారు. 44,250 ఓట్లు పొందిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాను 18,953 ఓట్ల తేడాతో ఓడించారు. ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తా 14,085 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు.కాగా, తొలి ఎన్నికల పోటీలో గెలిచిన తర్వాత ప్రశాంత్ కిషోర్ మీడియాతో మాట్లాడారు. బంకీపూర్ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన తక్షణ ప్రాధాన్యత అని తెలిపారు. 'ఈ విజయం తర్వాత మా మొదటి





ప్రాధాన్యత బంకీపూర్ ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని, మాకు అందించిన ఆశీర్వాదాలను గౌరవించడం. బంకీపూర్ అభివృద్ధికి సాధ్యమైనంత కృషి చేస్తాం. రాబోయే రెండు మూడు నెలల్లోనే ఆ మార్పులు మీకు కనిపిస్తాయి' అని అన్నారు.మరోవైపు అతిగా ఆశలు పెట్టుకోవద్దని బంకీపూర్ నియోజకవర్గం ప్రజలకు ప్రశాంత్ కిషోర్ సూచించారు. ఎమ్మెల్యేగా తన ఎన్నిక బంకీపూర్‌ను 'రాత్రికి రాత్రే బెంగళూరుగా' మార్చదని అన్నారు. అయితే రాబోయే కొద్ది నెలల్లోనే స్పష్టమైన అభివృద్ధి పనులు చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు.కాగా, ఈ తీర్పు బీజేపీ నాయకత్వానికి ఒక రాజకీయ సందేశాన్ని ఇచ్చిందని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'బీహార్ ముఖ్యమంత్రిగా ఒక మంచి వ్యక్తిని నియమించాలని బాంకీపూర్ ప్రజలు బీజేపీ నాయకత్వానికి స్పష్టమైన సందేశాన్ని పంపారు. ఎంపికయ్యే వ్యక్తి సమర్థుడై, నిజాయితీపరుడై ఉండాలి. అసలు ముఖ్యమైన విషయం బీహార్ అభివృద్ధి' అని ఆయన అన్నారు.

## 2.5 ఏళ్ల తర్వాత కనిపించిన
### ఆంగ్ సాన్ సూకీ



**నైపితా:** ఆంగ్ సాన్ సూక్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు. సుమారు 2.5 ఏళ్ల తర్వాత ఆమె తొలిసారి బయటి ప్రపంచానికి కనిపించారు. రెడ్‌క్రాస్‌కు చెందిన అంతర్జాతీయ కమిటీ సభ్యుడితో ఆమెతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆ ఫోటోలను మయన్మార్ మిలిటరీ అధికారులు రిలీజ్ చేశారు. బర్మా నేత ఆంగ్ సాన్ సూకీ .. ఆర్మీ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. ఆంగ్ సూకీ ఆచూకీ లేదని రెండున్నర ఏళ్ల క్రితం ఆమె కుమారుడు ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే. మిలిటరీ సర్కారు రిలీజ్ చేసిన ఫోటోల్లో సూకీ ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించారు.2021లో ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూల్చి.. ఆర్మీ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత ఆమెను నిర్బంధించిన విషయం తెలిసిందే. వేర్వేరు కేసుల్లో ఆమెకు 33 ఏళ్ల జైలుశిక్ష విధించారు. అయితే ఆమెపై శిక్షను తగ్గించి, గృహ నిర్బంధానికి తరలించారు. సూకీ ప్రాణాలతో ఉన్నట్లు పలుసార్లు ఆర్మీ హామీ ఇచ్చింది. కానీ గతంలో ఎటువంటి ఆధారాలు చూపలేదు. అయితే సుమారు రెండున్నర ఏళ్ల తర్వాత ఆమె ఫోటోలు రిలీజ్ కావడం గమనార్హం. ఆమె కుమారుడు కిమ్ ఆరిస్ గత కొన్ని నెలలుగా అంతర్జాతీయంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. 81 ఏళ్ల సూకీ సజీవంగా ఉన్నట్లు ఆధారాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## 'రష్యన్ అమెజాన్' వేర్‌హౌజ్‌పై
### ఉక్రెయిన్ డ్రోన్ దాడి






**మాస్కో:** రష్యాపై భీకర స్థాయిలో డ్రోన్లతో అటాక్ చేసింది ఉక్రెయిన్. శనివారం రష్యా చేసిన దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్ విరుచుకుపడింది. అయితే వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్ ను టార్గెట్ చేసింది. రష్యాన్‌లో ఆన్‌లైన్ రిటేలర్‌గా ఉన్న వైల్డ్‌బెర్రీస్ వేంహౌజ్‌పై దాడి చేసింది. దీన్ని రష్యా అమెజాన్‌గా కీర్తిస్తుంటారు. మాస్కోకు సుమా రు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను డ్రోన్‌తో అటాక్ చేసినట్లు వీడియోలు రిలీజ్ అయ్యాయి. వైల్డ్ బెర్రీస్ వేర్‌హౌజ్.. రష్యాలో కీలకమైన లాజిస్టిక్ హబ్. అయితే ఆ కేంద్రాలను ఉక్రెయిన్ టార్గెట్ చేస్తున్నది. రష్యా మిలిటరీకి డ్రోన్ కాంపోనెంట్లు, నావి గేషన్ ఎక్విప్మెంట్, ఇతర సామాగ్రిని ఈ వేర్‌హౌజ్‌ల నుంచి సరఫరా చేస్తుంటారు. వైల్డ్‌బెర్రీస్ సైట్లపై ఇటీవల ఉక్రెయిన్ వరు సగా దాడి చేస్తున్న విషయం తెలిసిందే. శని వారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో కీవ్‌పై దాడి చేసింది. ఆ ఘటనలో 9 మంది మృతి చెందగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు.ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో విద్యుత్తు సర ఫరా నిలిచిపోయింది.

## ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల
### మందిపై నిఘా వేసిన చైనా

**చైనా:** ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికా కు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది.

అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా.. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్జియాకోవ్ నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా,



న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవ్ హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం.

Edited,Printed,Published and Owend by CHITELA KRISHANA ,Printed at sravanthi prienters , rtc crss road ,Hyderabad-500001. Published at:4-80/1, VIKARABAD, Telangana.